క్లుప్తంగా

ఎస్పీ దంపతుల పూజలు



మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని మహాగాయత్రి దేవాలయంలో ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి.పాటిల్ దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు వంకోజు జలేంద్రాచార్యులు స్వాగతం పలికాడు. ఎస్పీ దంపతులు వారి కుమారుడికి అక్షరాభ్యాసం చేయించారు.

మార్కెట్ చైర్మన్ పదవి ఇవ్వాలి



కేసముద్రం: కాంగ్రెస్ పార్టీలో అహర్నిషలు శ్రమించిన తనకు కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి ఇవ్వాలని కోరుతూ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే మురళీనాయక్‌కు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, కేసముద్రం పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి బుధవారం వినతిపత్రాన్ని అందజేశాడు. కార్యక్రమంలో నాయకులు అయూబ్ ఖాన్, తరాల వీరేష్, శ్రావణ్, సంపత్, మహేందర్, సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్



తహసీల్దార్ స్వాతిబిందు

గార్ల: ఓటర్ల జాబితాలో పేర్లలో తప్పొప్పులు సరి చేసుకునేందుకు, చనిపోయిన వారి పేర్ల తొలగింపునకు ఈనెల 20, 21వ తేదీల్లో అన్నిపోలింగ్ కేంద్రాల్లో బీఎల్ ఓలకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ స్వాతిబిందు తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పార్లమెంట్ ఎన్నికల కోసం ఈనెల 6వ తేదీన అన్ని పోలింగ్ కేంద్రాల్లో కొత్త ఓటర్ లిస్ట్ పబ్లికేషన్ చేశామని పేర్కొన్నారు. కొత్త ఓటర్ లిస్ట్ సంబంధిత బీఎల్ఓల వద్ద ఉంచామన్నారు.

శ్రీరామ నామం జపించాలి



మహబూబాబాద్ రూరల్: అయోధ్యలో శ్రీబాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 22వ తేదీ రోజున అందరి ఇళ్లలో శ్రీరామ నామం జపించాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తెలంగాణ ప్రముఖ్ ముడుపు ఆదిరెడ్డి అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామివారి దేవాలయంలో బుధవారం రాత్రి ప్రత్యేక సమావేశంలో ఆదిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బబిరిశెట్టి శ్రీనివాస్, శ్రీరంగం మురళి, కొండ్లె బద్రీనాథ్, ఇందుభారతి, భువనగిరి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ జలాలతో చెరువులు నింపాలి

● డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



మరిపెడ: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ: రైతాంగానికి సాగునీరు అందేలా మండలంలోని ప్రతి చెరువును ఎస్సారెస్పీ సాగుజలాలతో నింపాలని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించాడు. మరిపెడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గుగులోతు అరుణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాంచంద్రునాయక్ హాజరయ్యాడు. ముందుగా వ్యవసాయం, హార్టికల్చర్, పశువైద్యశాఖ, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, విద్యుత్, మిషన్ భగీరథ, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులు అభివృద్ధి పనులు, సమస్యలపై నివేదికలను సభలో చదివి వినిపించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ సీజన్‌కు సాగు నీటికి వేసవి ప్రారంభంలో కొంత కొరత ఉండవచ్చనని, అందుకు సాగు రైతులను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించాడు. మండలంలోని ఉన్న 69 చెరువులకు సాగు జలాలతో నింపేలా చర్యలు చేపట్టాలన్నాడు. సభలో వెల్లడించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరాడు. మరో 10 రోజుల్లో పదవికాలం అయిపోతున్నందున సర్పంచుల పెండింగ్ బిల్లులు విడుదల అయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చాడు. గత ప్రభుత్వంలో 10 సంవత్సరాలు స్తబ్ధతగా ఉన్న సర్పంచులు, ఎంపీటీసీలు కొత్త ప్రభుత్వంలో పలు సమస్యలను లేవనెత్తడం విశేషం. కార్యక్రమంలో జెడ్పీటీసీ తేజావత్ శారద, కుడితి మహేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గాదె అశోక్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్ చేయాలి

మరిపెడ రూరల్: తమతో సేవలు చేయించుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఉద్యోగాలు రెగ్యులరైజేషన్ చేయాలని గైడ్ ఫోర్ట్, జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌కు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు.

రహదారులు నిర్మించాలి

గార్ల: గార్ల, డోర్నకల్ మండలాల సరిహద్దు గ్రామాల్లో రహదారుల నిర్మాణం చేపట్టి మండలాల మధ్య సమన్వయం పెంచాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌ను గార్లవాసి టీపీసీసీ సభ్యులు రావూరి వెంకట్రామయ్య కలిసి వినతిపత్రం అందజేశాడు.

మహాసభలను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: ఖమ్మంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11, 12 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో బుధవారం విద్యా వైజ్ఞానిక మహాసభల వాల్‌పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా కవిత మాట్లాడుతూ.. ప్రభుత్వాల నిర్లక్ష్య విధానాలతో ఏళ్ల తరబడి అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఉపాధ్యాయ కామన్ సర్వీస్ రూల్స్, పండితుల, పీఈటీల అప్ గ్రేడేషన్, సీపీఎస్ విధానం రద్దు, 317 జీఓ బాధితులు, కేజీబీవీ, మోడల్ స్కూల్ రెసిడెన్షియల్, ఆశ్రమ ఐటీడీఏ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి పులిచింతల విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు బలాష్టి రమేష్, బొల్లం శ్రీనివాస్, కొమిర ఉప్పలయ్య, సోమ విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

రామరాజ్య స్థాపనే మోదీ లక్ష్యం



గూడూరు: రాముడి అక్షింతలు పంపిణీ చేస్తున్న హుస్సేన్‌నాయక్

గూడూరు: దేశంలో రామరాజ్య పాలన అందిస్తూ, ప్రజలందరికీ సమాన న్యాయం అందించడమే పీఎం నరేంద్రమోదీ లక్ష్యమని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. మండలంలోని మర్రిమిట్టలో బుధవారం అయోధ్య ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టిన అక్షింతల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 22 న అయోధ్య మందిర ప్రారంభంతో దేశంలో నాటి రాముడి పాలన వస్తుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, మోదీన్ నాయక్, మల్లయ్యగౌడ్, నరేష్‌గౌడ్, రాంబాబు నాయక్, శ్రీశైలం, రాజు పాల్గొన్నారు.

కురవి: అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను సీరోలు మండల కేంద్రంలో బుధవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్యామల రంగమ్మ, ఉప సర్పంచ్ నాగేశ్వర రావు, భక్తులు పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: మరిపెడ మండలం గిరిపురం గ్రామంలో శ్రీరాముడి అక్షింతలను బుధవారం గ్రామంలోని ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దబోయిన జనార్దన్, ఉపసర్పంచ్ సుమలతసురేష్ పాల్గొన్నారు.

భగీరథ ట్యాంక్, గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయం ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

తొర్రూరు రూరల్: గ్రామ అభివృద్ధికి అన్నివర్గాల ప్రజలు సహకారం అందించాలని సర్పంచ్ రావుల మమతారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అరిపిరాల గ్రామంలో నూతనంగా నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంక్, గ్రంథాలయాన్ని ప్రారంభించాడు. కార్యక్రమంలో ఎంపీటీసీ వల్లపు గోపమ్మ, ఉప సర్పంచ్ చెంచర్ల రాజు, కార్యదర్శి దేవయ్య, సురేష్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం

మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్, గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించిన కొద్దిసేపటికే ఆయా అభివృద్ధి పనులకు చెందిన శిలాఫలకాలు ధ్వంసం చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మమతరెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డితోపాటు మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులను ఆహ్వానించామని, వారు రాకపోవడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలే కావాలని కక్షపూరితంగా వ్యవహరించి శిలాఫలకాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. ఇట్టి విషయంపై మంత్రులు, ఉన్నత స్థాయి అధికారులు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, వెంటనే విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై కఠిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామ శివారు సత్యాతండాకు చెందిన ఓ యువతి అదృశ్యమైంది. ఎస్సై రఘూనీ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. సత్యాతండాకు చెందిన 19 ఏళ్ల నవ్య ఈనెల 15వ తేదీ రాత్రి భోజనం చేసిన అనంతరం ఇంట్లో పడుకుని అర్ధరాత్రి అదృశ్యమైంది. యువతి తండ్రి మాన్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, తండాకు చెందిన ఓ యువకుడిపై మాన్‌సింగ్ అనుమానం వ్యక్తం చేస్తున్నాడని ఎస్సై తెలిపాడు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

దంతాలపల్లి: మండలంలోని అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును సీజ్ చేసినట్లు ఎస్సై రమేష్ బాబు తెలిపాడు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామానుజపురం గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టరును సీజ్ చేసి డ్రైవర్ మల్లం రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపాడు.

నివాళి

బయ్యారం: మండలంలోని గంధంపల్లి-కొత్తపేటకు చెందిన హమాలీ వర్కర్స్ జిల్లా నాయకుడు నర్సయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందగా పలువురు నాయకులు మృత దేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య, ఇష్టూ జిల్లా కార్యదర్శి మాధంశెట్టి నాగేశ్వరరావు, నాయకులు శంకర్, సత్యం, రాముడు, వీరస్వామి నివాళులర్పించారు.

ఉపాధి హామీ పథకం ప్రజావేదిక



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

కురవి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో 2020నుంచి 2023 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం చేసిన తనిఖీలకు సంబంధించి ప్రజావేదిక కార్యక్రమాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరిగింది. నేరడ గ్రామం నుంచి నివేదిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేరడ, జుజ్జూర్ తండా కార్యదర్శి, టీఏలకు ఫైన్ విధించారు. సూదనపల్లిలో మొక్కల ట్రాన్స్‌పోర్ట్ బిల్లులు అదనంగా చెల్లించారని నివేదికలో తెలిపారు. దీంతో టీఏ, ఈసీలకు ఫైన్ విధించారు. కందికొండ గ్రామంలో జామాయిల్, టేకు మొక్కలు నాటినట్లు రికార్డుల్లో చూపగా, తనిఖీ బృందం సభ్యులకు గ్రామంలో తనిఖీ చేయగా ఒక్క మొక్క కనిపించలేదని తేల్చారు. దీంతో తిరిగి మొక్కలను నాటాలని ఆదేశించారు. జరిగిన పనుల వివరాలతో కూడిన నేమ్ బోర్డులను పెట్టినట్లు రికార్డుల్లో చూపి పని ప్రదేశంలో బోర్డులు కనిపించలేదని తనిఖీ బృందం నివేదికలో పొందుపరిచారు. దీంతో సంబంధిత అధికారుల నుంచి రికవరీ చేయాలని సూచించారు. చింతపల్లి గ్రామంలో రైతు తోటలో ట్రెంచ్ పనులు కనిపించలేదని ప్రజావేదికలో అధికారులకు వివరించారు. దీనిపై రైతులకు నోటీసులు అందించాలని కార్యదర్శి, టీఏలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుగులోత్ పద్మావతి, ఎంపీడీఓ సరస్వతీ, ఏపీడీ(డీఆర్‌డీఏ) శాంతకుమారి, అంబుడ్స్‌మెన్(జిల్లా గ్రీవెన్స్ అధికారి) బెస్త ఆదాము, డీవీసీ(విజిలెన్స్) యాకూబ్, ఎస్ఆర్‌పీ(ఆడిట్) సురేందర్ బాబు, ఏపీఓ యాకాంబ్రం పాల్గొన్నారు.

భూములకు పరిహారం పెంచాలి



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

కురవి: మండలంలోని అయ్యగారిపల్లి గ్రామం నుంచి వెళ్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల కోసం సేకరించనున్న భూములకు ప్రభుత్వం అందజేసే పరిహారం మొత్తాన్ని పెంచాలని గ్రామానికి చెందిన రైతులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. బుధవారం అయ్యగారిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులతో తహసీల్దార్ సునీల్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఒక్కో ఎకరానికి రూ14.40లక్షలు చెల్లిస్తుందని రైతులకు రెవెన్యూ అధికారులు వివరించారు. ఇక్కడి భూములు మార్కెట్‌లో ఎకరానికి రూ.40లక్షల నుంచి 50లక్షలు, మెయిన్‌రోడ్డు పక్కన రూ.కోటి వరకు పలుకుతుందని రైతులు వివరించారు. ప్రభుత్వం అందజేసే పరిహారం పెంచాలని డిమాండ్ చేశారు. ఈమేరకు రైతులందరూ భూములకు పరిహారం పెంచాలని వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీల్‌రెడ్డి, రైతులు బండి రవీందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, వాసుదేవరెడ్డి, నర్సింగం వెంకన్న, చిట్టిపురెడ్డి వెంకటరెడ్డి, తాడబోయిన యాకాంబ్రం, నూకల నాగన్న, నర్సింగం అశోక్, రవి, మల్లేషం, జనార్దన్‌రెడ్డి, నాగన్న పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కులు సాధించుకోవాలి



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

మరిపెడ/మరిపెడ రూరల్: ఐక్యతతోనే హక్కులు సాధించుకోవాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్ మాదిగ అన్నారు. ముందుగా మండలంలోని అన్నిగ్రామాల నుంచి వచ్చి సంఘం సభ్యులతో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నూతన కమిటీలను బుధవారం ఎన్నుకున్నారు. ఈసందర్భంగా మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఎదుట సంఘాల జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు అనిల్‌కుమార్, రమేష్, ఎల్లయ్య, ఉపేందర్, కిరణ్, సురేష్, రవి, సైదులు, వెంకన్న, స్వామి, బాబు, వెంకన్న, మైసయ్య, రాములు, నగేష్ పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని డోర్నకల్ మండలంలో గల టేకుల తండా, తోడేళ్లగూడెంలో గుడుంబా స్థావరాలపై బుధవారం దాడులు నిర్వహించామని ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి అన్నారు. గుడుంబా స్థావరాలపై నిర్వహించిన దాడుల్లో 200 లీటర్ల షుగర్ వాష్ ధ్వంసం చేసి, 10 లీటర్ల సారాయి సీజ్ చేసి, మాలోతు ఉమాశంకర్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై కృష్ణమూర్తి, సిబ్బంది వెంకటనర్సయ్య, యాదగిరి, మధు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సుఖప్రసవాలు



గార్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సుఖప్రసవాలు ఎక్కువగా అయ్యేలా ప్రోత్సహిస్తామని గార్ల సీహెచ్‌సీ డాక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం గార్ల పంచాయతీ జీవంజిపల్లి గ్రామానికి చెందిన చలవాది శ్రావణికి స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రిలో నార్మల్ డెలివరీ చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. డెలివరీ అనంతరం శ్రావణికి డెలివరీ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో నర్సులు స్వరూప, బాలగోపి, ఆశవర్కర్ పుష్ప, వైద్య సిబ్బంది ఉమా, కళావతి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గించొద్దు

బయ్యారం: వ్యవసాయానికి సరఫరా చేస్తున్న విద్యుత్‌లో ప్రతిరోజు అంతరాయలు కల్పించడం వలన రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఏఐకెఎంఎస్ రాష్ట్ర నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడారు. బయ్యారం, గార్ల మండలాల్లో ఇటీవల విద్యుత్ సరిగా లేకపోవటంతో సాగు చేసిన మొక్కజొన్న, వరి, మిరప పంటలకు నీటిని అందించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా నిరంతరం విద్యుత్‌ను అందించాలన్నారు. సమావేశంలో నాయకులు వెంకన్న, మురళి, సత్యం పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

కేసముద్రం: మండల కేంద్రంలో బతుకుదెరువు కోసం వలస వచ్చిన నిరుపేదలకు పీడీఎస్‌యూ అధ్యక్ష, కార్యదర్శులు బనిషెట్టి విజయ, వెంకటేష్ బుధవారం దుస్తువులు, దుప్పట్లను పంపిణీ చేశారు.

గూడూరు: రాబిన్ ఫుడ్ ఆర్మీ స్వచ్ఛంద సంస్థ సేవలు ప్రశంసనీయమని సర్పంచ్ వసంత రమేష్ అన్నారు. మండలంలోని గాజులగట్టులో బుధవారం సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకన్నగౌడ్, ప్రతినిధులు రమేష్‌గౌడ్, బాలూనాయక్, వాల్యానాయక్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

గంగారం: మార్చి 3న ఖమ్మంలో జరుగు భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజాపంథా గంగారం, కొత్తగూడ మండల కార్యదర్శి పూనెం ప్రభాకర్, సత్యం, జోగ రాములు, వీరస్వామి, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన



డోర్నకల్: స్థానిక మైనారిటీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలను బుధవారం మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, కమిషనర్ మున్వర్ అలీ పరిశీలించాడు. పాఠశాల, కళాశాలల ముందు రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు అంచనాలను తయారు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో చైర్మన్, కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పర్వీన్ సుల్తానా, మునిసపల్ ఏఈ బాబు, మైనారిటీ నాయకులు అఖిల్‌ఖాన్, వాజీద్, ఖాదర్‌బాబా, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల విడుదలకు సహకరించాలి

డోర్నకల్: మున్సిపాలిటీ అభివృద్ధికి కేటాయించి నిలిచిపోయిన నిధులను విడుదల చేయించేందుకు ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వీరన్న మాట్లాడుతూ.. ఎన్నికలు రావడంతో నిధులు వెనక్కు వెళ్లాయని, ఎమ్మెల్యే చొరవ తీసుకుని రూ.35 కోట్ల నిధులు మంజూరు చేయించి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

భవిష్యత్‌ను ఆగం చేసుకోవద్దు

నెల్లికుదురు: మొబైల్ ఫోన్ మోజులో పడి విద్యార్థులు భవిష్యత్‌ను ఆగం చేసుకోవద్దని న్యూ జనరేషన్ ఆఫ్ ఫౌండేషన్ బ్రాహ్మణకొత్తపల్లి అధ్యక్షుడు చిర్ర యాకాంతం గౌడ్ సూచించాడు. మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామంలో విద్యార్థుల్లో చైతన్యం నింపడానికి బుధవారం దిశా నిర్దేశం అనే కార్యక్రమంల నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజనీర్ రుద్రారపు మహేష్, బాధ్యులు, ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలో కేసముద్రం పీఏసీఎస్, డీసీసీబీ, కేసముద్రం ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో కేసముద్రం పీఏసీఎస్ చైర్మన్ దీకొండ వెంకన్న, డీసీసీబీ నోడల్ ఆఫీసర్ రజిత, మేనేజర్ సింధూ, సూపర్‌వైజర్ నరేష్, సర్పంచ్ దార్ల రామ్మూర్తి, హరిచంద్, పింగిలి శ్రీనివాస్, సీఈఓ వెంకటాచలం పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్ మంజూరు చేయాలి



గార్ల: గత ప్రభుత్వంలో ఎన్నికల ముందు డీడీలు కట్టిన గొల్లకురుమ కులస్తులందరికీ వెంటనే గొర్రెల యూనిట్లు మంజూరు చేయాలని బీజేపీ జిల్లా నాయకురాలు, ఎంపీటీసీ గుండెబోయిన నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు కేసీఆర్ ప్రభుత్వం గొల్ల కులస్తులకు 80శాతం రాయితీపై గొర్రెలు ఇస్తామని చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.43వేలు డీడీ కట్టించుకొని గొర్రెలు ఇవ్వకుండా మోసం చేసిందని ఆరోపించారు. సమావేశంలో లక్‌పతి, పూర్ణయ్య, వీర్యా, రమేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కేసముద్రం: మండలంలోని కేసముద్రంవిలేజ్, కోరుకొండపల్లి గ్రామాల మధ్య మలుపు వద్ద ద్విచక్రవాహనాన్ని, ఎదురుగా వస్తున్న లారీ మంగళవారం ఢీ కొట్టిన విషయం తెలిసిందే. ఈమేరకు వరంగల్‌లోని రామన్నపేటకు చెందిన సంద్రగిరి బాలరాజు(58) అనే వ్యక్తి తలకు తీవ్ర గాయాలు కాగా, మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై వంశీధర్ తెలిపాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

పండుగకు వచ్చిన అల్లుడు..

ఖమ్మంఅర్బన్: సంక్రాంతి పండుగకు అత్తారింటికి వచ్చిన అల్లుడు (డాక్టర్) గుగులోత్ ఉమేశ్ (37) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు, ఆయన తండ్రి లచ్చిరాం ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి బుధవారం తెలిపాడు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో డాక్టర్‌గా (ఆస్పత్రి నడుపుతున్న) పనిచేస్తున్న డాక్టర్ ఉమేశ్ సంక్రాంతి పండుగకు తన భార్య అశ్విని, కుమారుడు, కుమార్తెతో కలిసి ఈ నెల 15న పాండురంగాపురంలో ఉంటున్న అత్తారింటింకి వచ్చారు. మంగళవారం బంధువులంతా ఓ ఫంక్షన్‌లో పాల్గొన్నారు. రాత్రి పడుకున్న అనంతరం అస్వస్థతకు గురైన ఉమేశ్‌ను ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తుండగా మృతిచెందినట్లు తమకు సమాచారం అందించారని, తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని మృతుడి తండ్రి లచ్చిరాం ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించామని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు గాయాలు


మహబూబాబాద్ రూరల్: ద్విచక్ర వాహనం ఢీకొని హోంగార్డుకు తీవ్రగాయాలైన సంఘటన పట్టణంలోని ఇందిరా చౌక్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. టౌన్ ఎస్సై రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా పోలీసు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఎస్కే మహమూద్ పాషా రోడ్డుపై వెళ్తుండగా ఇస్లావత్ వంశీ అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వచ్చి ఢీకొట్టాడు. దీంతో పాషాకు తీవ్రగాయాలు కావడంతో ట్రాఫిక్ ఎస్సై శ్యాంసుందర్, సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. కాగా ఆ యువకుడు పాషాను ఢీకొట్టక ముందు ఓ వృద్ధుడిని కూడా ద్విచక్ర వాహనంతో ఢీకొట్టి గాయపరిచాడని స్థానికులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఇద్దరికి గాయాలు



దంతాలపల్లి: లారీ బైక్‌ను ఢీకొనగా ఇద్దరి వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. పెద్దవంగర మండల కేంద్రానికి చెందిన గాజుల అనిల్ మండలంలోని రామవరం గ్రామానికి తన సోదరి కృపారాణిని తీసుకొని బైక్‌పై బంధువుల ఇంటికి వస్తున్నాడు. కసుకదుర్గ రైస్ మిల్ సమీపంలో ములుగు జిల్లా నుంచి సూర్యాపేట్ వైపు వెళ్తున్న లారీ రాంగ్ రూటులో ఎదురుగా వచ్చి బైకును ఢీకొట్టింది. అనిల్ కాలు విరగగా, కృపారాణికి తలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై రమేష్‌బాబు సిబ్బందితో అక్కడికి చేరుకొని 108 వాహనంలో చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు



పెద్దవంగర: యువకుడిపై కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై పిల్లల రాజు తెలిపిన వివరాల ప్రకారం .. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన తుమ్మ దీపక్‌రెడ్డి కుటుంబ సభ్యులతో అత్తగారి గ్రామమైన పెద్దవంగర మండలంలోని కొరిపల్లి గ్రామానికి సంక్రాంతి పండగకు వచ్చి ఇదే గ్రామానికి చెందిన సాకి రాములు, సాకి యాకయ్యతోపాటు అతని కుమారులు సాయికుమార్, మహేష్‌లు పాత కక్షలను మనసులో పెట్టుకొని దీపక్‌రెడ్డిపై కత్తులు, కర్రలతో దాడి చేసిన విషయం తెలిసిందే. సదరు ఘటన విషయంలో బాధితుడి భార్య తుమ్మ మహేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బుధవారం పోలీసుల పెట్రోలింగ్ వాహనంలో వెళ్తుండగా ఆ నలుగురు నిందితులు పోలీసుల చూసి పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. తామే దాడికి పాలుపడినట్లు ఒప్పుకున్నారు. కేసు కేసు నమోదు చేసి కోర్టుముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కురవి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 2007- 08 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. అప్పటి హెచ్‌ఎం రామచంద్ర, ఉపాధ్యాయులు ఇస్లావత్ లచ్చిరాం, బాలాజీ, స్వామి, వెంకటేశ్వర్లు, విశ్వేశ్వరరావు, గుమ్మళ్ల సురేందర్ ను సత్కరించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కర్లం సింధువర్మ, మేడి ప్రశాంత్, గడిల రంజిత్ కుమార్, అప్పాల రాజేందర్, రామడుగు నాగరాజు, గంగరబోయిన విజయ్ పాల్గొన్నారు.